యురేనియం అన్వేషణకు ఎన్జీఆర్ ఐతో ఏఎండీ ఒప్పందం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13(నమస్తే తెలంగాణ) : దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యురేనియం నిక్షేపాలను అన్వేషించేందుకు ఎన్జీఆర్ఐ సంస్థ కృషి చేయనున్నది. ఈ మేరకు అటమిక్ మినరల్ డైరెక్టరేట్ (ఏఎండీ)తో ఒప్పందం కుదుర్చుకొన్నది. ఈ ఒప్పందం ప్రకారం.. దేశవ్యాప్తంగా భార లోహ నిక్షేపాలను అన్వేషించేందుకు అధునాతన టెక్నాలజీ హెలిబోర్న్ ఆధారంగా సర్వే చేపట్టనున్నారు. ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, ఏఎండీ డైరెక్టర్ ధీరజ్ పాండే ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దేశ పురోగతికి శక్తి వనరుల ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ కార్యక్రమానికి ఇదొక కీలక మలుపు అవుతుందని, ఖనిజ అన్వేషణను విస్తృతం చేయడంలోనూ ఈ ఒప్పందం సహకరిస్తుందని తెలిపారు.

ల్యాండ్ బ్యాంక్ కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : వివిధ ప్రాజెక్టు అవసరాల కోసం అటవీభూముల కేటాయింపుల సందర్భంగా పర్యావరణానికి, వన్యప్రాణుల ఆవాసాలకు ఆటంకాలు లేకుండా ఉండేందుకు వీలుగా ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. వన్ సంరక్షణ్, సంవర్ధన్ రూల్స్ -1980 అనుసరించి ఈ కమిటీ పనిచేయనున్నది. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వైల్‌పర్సన్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, చీఫ్ వైల్డ్‌లైఫ్ అధికారి, రెవెన్యూశాఖ ప్రతినిధి, సీసీఎల్ఏ ప్రతినిధిగా మాలతి, పర్యావరణశాఖ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు శుక్రవారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై-సత్రగాచి రైల్వే స్టేషన్ల మధ్య ఈ నెల 13 నుంచి 16 వరకు రాకపోకలు కొనసాగిస్తాయని వెల్లడించారు.

ఏసీబీకి చిక్కి సీఐ పరుగోపరుగు!

రూ.3 లక్షలు తీసుకుంటుండగా పట్టివేత

- చీటింగ్ కేసు నుంచి బయటపడేసేందుకు మొత్తం రూ.15 లక్షల లంచం డిమాండ్
- అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు తీసుకున్న సీఐ
- హైదరాబాద్ సీసీఎస్‌లో మరో అవినీతి చేప

ఏసీబీకి చిక్కిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): చీటింగ్ కేసు నుంచి నిందితుడిని తప్పించేందుకు రూ.3 లక్షల లంచం తీసుకుంటూ హైదరాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదురుగా పార్కింగ్ స్థలంలో గురువారం బాధితుల నుంచి డబ్బులు ఉన్న బ్యాగ్‌ను అందుకున్న ఇన్‌స్పెక్టర్.. ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకొని ఆ బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. అధికారులు ఛేజ్ చేసి సీఐని పట్టుకున్నారు. ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైయిన సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు కేసును మరువకముందే, మరో ఇన్‌స్పెక్టర్ భారీ స్థాయిలో లంచం తీసుకుంటూ పట్టుబడటం గమనార్హం. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం... ఆర్థిక నేరాల కేసులను దర్యాప్తు చేసే సీసీఎస్‌లోని టీమ్-7 ఇన్‌స్పెక్టర్‌గా చామకురి సుధాకర్ ఉన్నాడు. క్రైమ్ నంబర్ 41/2024కు సంబంధించిన చీటింగ్ కేసు దర్యాప్తు బాధ్యతలు చూస్తున్నాడు. యాప్రాల్‌కు చెందిన వ్యాపారి సీవీఎస్ సత్యప్రసాద్ వ్యాపార విస్తరణ కోసం తన డూప్లెక్స్ ఇంటిని అమ్మే విషయంలో బోయిన్‌పల్లికి చెందిన మని రంగస్వామి, హేమ సుందర్‌రెడ్డి తనను రూ.1.48 కోట్లు మోసం చేశారంటూ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు బాధ్యతను ఉన్నతాధికారులు సుధాకర్‌కు అప్పగించారు. నిందితుడైన మని రంగస్వామిని ఈ కేసు నుంచి బయట పడేసేందుకు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రూ.15 లక్షల లంచం డిమాండ్ చేశాడు. అడ్వాన్స్‌గా ఇప్పటికే రూ.5 లక్షల లంచం తీసుకున్నాడు. మిగతా సొమ్ము ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడంతో రంగస్వామి ఏసీబీని ఆశ్రయించాడు. ఒప్పందంలో భాగంగా రంగస్వామి రూ.3 లక్షల లంచం గురువారం ఇస్తానంటూ సుధాకర్‌కు హామీ ఇచ్చాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో రూ.3 లక్షల నోట్ల కట్టలు బ్యాగ్‌లో పెట్టుకొని రంగస్వామి బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలానికి చేరుకున్నాడు. రంగస్వామి ఫోన్ చేయగానే సుధాకర్ అక్కడకు వచ్చి లంచం డబ్బులు ఉన్న బ్యాగ్‌ను తీసుకున్నాడు. అప్పటికే అక్కడ మాటువేసిన ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా ఇన్‌స్పెక్టర్‌ను పట్టుకున్నది. అధికారులను వదిలించుకొని ఆ నగదు బ్యాగ్‌ను అక్కడే వదిలేసి సుధాకర్ పరారయ్యాడు. వెంటనే ఏసీబీ ఇన్‌స్పెక్టర్ సతీశ్, కానిస్టేబుళ్లు మున్నా, గోవిందనాయక్, హరికాంత్‌రెడ్డి.. సుధాకర్‌ను వెంటపడి ఛేజింగ్ చేసి పట్టుకున్నారు. లంచం డబ్బులు ఉన్న బ్యాగ్‌ను రికవరీ చేసి చేతివేళ్లను కెమికల్‌తో పరీక్షించగా పాజిటివ్ వచ్చింది. సుధాకర్‌ను అరెస్టు చేసి, లంచం డబ్బులు రికవరీ చేశారు.

చికిత్స చేయించుకున్న రోగితో యశోద దవాఖాన వైద్యులు

ప్రోస్టేట్ సమస్యకు రెజమ్ థెరపీ

యశోద దవాఖానలో విజయవంతంగా చికిత్స

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ప్రోస్టేట్ (వీర్యగ్రంథి)లో నొప్పితో బాధపడుతున్న రోగికి యశోద వైద్యులు అత్యాధునిక 'రెజమ్' థెరపి చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ రకమైన వైద్య చికిత్సను తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా నిర్వహించినట్టు దవాఖాన వర్గాలు పేర్కొన్నాయి. కామారెడ్డి చెందిన రైతు ఎస్ అంజాగౌడ్ (68) కొన్ని రోజులుగా మూత్ర విసర్జన సమయంలో తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నాడు. గత నెలలో ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించిన యశోద డాక్టర్లు ప్రోస్టేట్ అబ్‌స్ట్రక్షన్స్(బ్లాకేజ్)సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వయస్సు రీత్యా శస్త్రచికిత్స వల్ల ఇబ్బందులు కలిగే అవకాశముండటంతో 'రెజమ్ వాటర్ వేపర్ థెరపీ'తో చికిత్స చేయాలని నిర్ణయించారు. గతనెల 28న సోమాజిగూడ యశోద దవాఖానలో రోగికి విజయవంతంగా 'రెజమ్ వాటర్ వేపర్ థెరపి' నిర్వహించారు. యశోద హాస్పిటల్స్ సీనియర్ యూరాలజిస్ట్ అండ్ రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ వీ సూర్యప్రకాశ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ శస్త్రచికిత్స ఇష్టపడని యువ రోగులకు ఈ రెజమ్ చికిత్సా పద్ధతి ఉత్తమమైన ప్రత్యామ్నాయం అని చెప్పారు. ఈ చికిత్స తరువాత యువ రోగుల్లో ఎలాంటి లైంగిక సంబంధిత సమస్యలు ఏర్పడబోవని స్పష్టం చేశారు. రెజమ్ థెరపి ద్వారా మూత్రనాళంపై ఒత్తిడి కలిగించే అదనపు ప్రోస్టేట్ కణజాలాన్ని సమర్థంగా తొలగించవచ్చని వివరించారు. ఈ చికిత్స ఒక్క రోజులోనే పూర్తవుతుందని, అదేరోజున డిశ్చార్జి చేయవచ్చని వివరించారు.

'ఆయుష్'కు డబ్ల్యూహెచ్‌వో గుర్తింపు

సైదాబాద్, జూన్ 13 : సంప్రదాయ వైద్యంలో మౌలిక, సాహిత్య పరిశోధనల సహకార కేంద్రంగా సైదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఆయుష్)ను డబ్ల్యూహెచ్‌వో అధికారికంగా గుర్తించింది. ఇందుకుగాను సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్‌లోని తమ కార్యాలయాన్ని ఎంపికచేసిందని ఇన్‌చార్జి డైరెక్టర్ గోలి పెంచల ప్రసాద్ తెలిపారు. సీసీఆర్ఎస్ ఇండియా-177తో కొల్లాబోరేటివ్ సెంటర్‌గా జూన్ 3 నుంచి నాలుగేళ్ల పాటు జరిగే పరిశోధనల కోసం మంజూరు చేశారన్నారు. 1956లో స్థాపించిన ఆయుష్ సంస్థ ఆయుర్వేదం, యోగా, నేచురోపతి, సిద్ధ, సోవా-రిగ్పా, యునాని, హోమియోపతి, బయోమెడిసిన్‌తోపాటు దేశంలోని ఇతర సంబంధిత ఆరోగ్య సంరక్షణ విభాగాల్లో వైద్య-చారిత్రక పరిశోధనల డాక్యుమెంట్, ప్రదర్శనలకు ప్రత్యేకమైన సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. సంప్రదాయ వైద్య పరిశోధనలను ప్రొఫెసర్ వైద్య రబీనారాయణ నాయక త్వంలో డాక్టర్లు సాకేత్‌రామ్, సంతోష్ మానే బృందం కొనసాగిస్తారని పేర్కొన్నారు.

బుర్రా వెంకటేశం మెయిల్ ఐడీ హ్యాక్

హైదరాబాద్, జూన్ 13(నమస్తే తెలంగాణ): రాష్ట్ర విద్య, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మెయిల్ ఐడీ శ్రీబుర్రావెంకటేశం@జీమెయిల్.కామ్ హ్యాక్ అయిందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెయిల్ ఐడీ ద్వారా కొందరు మోసగాళ్లు ఉద్యోగులు, సాధారణ ప్రజలకు మెయిల్స్ పంపుతూ డబ్బులు అడుగుతున్నారని, ఇటువంటి వాటికి స్పందించకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తిచేశారు.

లోన్ ఇప్పిస్తామని ఐదెకరాలు కొట్టేశారు!

- రుణం ఇవ్వకుండానే వేరొకరికి రిజిస్ట్రేషన్
- నమ్మించి నట్టేట ముంచుతున్న ముఠాపై కేసు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకొని ఆ తరువాత బిచాణా ఎత్తేస్తున్న ముఠాలు హైదరాబాద్‌లో సంచరిస్తున్నాయి. బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్లకు చెందిన పీ రంజిత్‌రెడ్డి, పీ రంగారెడ్డి సోదరులు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. తమ అవసరాల కోసం ఆరెకరాల పొలం మార్టిగేజ్ చేసి రూ. 6 కోట్ల రుణం తీసుకోవాలనుకున్నారు. ఇందుకు తమ వ్యాపార భాగస్వామి ప్రభాకర్‌రెడ్డితో చర్చించి, అతడి ద్వారా మధ్యవర్తులు ఎర్ర విగ్నేష్ గౌడ్, గోశిక విశ్వనాథం కలిసి రుణం విషయం మాట్లాడారు. 5 శాతం కమిషన్‌తో ఆరు కోట్లు ఇప్పిస్తామంటూ బంజారాహిల్స్‌కు చెందిన ఫైనాన్సియర్ కేవీ ప్రసాద్ గుప్తాను కలిపించారు. ముందుగా ఒక శాతం ప్రాసెసింగ్ ఫీజు చెల్లిస్తే తాను ఎంఓయూ రాసుకొని, రిజిస్ట్రేషన్ తరువాత 45 రోజుల్లో మీకు రూ. 5 కోట్లు ఇస్తానంటూ నమ్మించి, ఒప్పందం చేసుకున్నాడు. ఈ మేరకు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ. 6 లక్షలు అందించి, ఫిబ్రవరి, 2022లో ఐదెకరాల పొలాన్ని కేవీ ప్రసాద్‌గుప్తా పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. 45 రోజుల తర్వాత డబ్బులివ్వకుండా రేపు మాపంటూ దాటవేస్తూ వచ్చారు. ఏప్రిల్, 2022 నుంచి ప్రసాద్ గుప్తా కనిపించకపోవడంతో రంజిత్‌రెడ్డి సోదరులు, వారి భాగస్వామి ప్రభాకర్‌రెడ్డి లోతుగా ఆరా తీశారు. తాము రిజిస్ట్రేషన్ చేసిన ఐదెకరాల పొలాన్ని మధ్యవర్తి జయన్న సహకారంతో పీ లక్ష్మీదేవి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి, ఆమె నుంచి రూ. 1.2 కోట్లు అప్పు తీసుకున్నట్టు తెలిసింది. లక్ష్మీదేవి, మధ్యవర్తులు విగ్నేశ్వర్‌గౌడ్, గోశిక విశ్వనాథం, జయన్న, కేవీ ప్రసాద్ అంతా ఒక ముఠాగా ఏర్పడి అమాయకులను మోసం చేస్తున్నారని రంజిత్‌రెడ్డి సోదరులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

జెర్రిలో విష ప్రభావమెంత

- అంచనా వేస్తున్న సీసీఎంబీ
- పశ్చిమ కనుమల్లో పరిశోధన

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): వందకు పైగా కాళ్లతో పాకుతూ తిరిగే శతపాదులు (జెర్రి జాతి)పై కొంత కాలంగా అధ్యయనం చేస్తున్న సీసీఎంబీ.. ఆ విష పురుగులో ఉండే విష ప్రభావంపై అంచనా వేస్తున్నది. అరుదైన జీవావరణం విస్తరించి ఉన్న పశ్చిమ కనుమల్లో పరిశోధనలు సాగిస్తున్న సీసీఎంబీ ఈ తరహా జీవుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తున్నది. శతపాది జాతులకు చెందిన జీవుల్లో న్యూరోటాక్సిక్, సైటో టాక్సిక్ ప్రొటీన్లు, పెప్టైడ్‌ల కాక్‌టెయిల్ ఉంటాయని సీసీఎంబీ పరిశోధకులు పేర్కొన్నారు. జెర్రి కాటు వేస్తే చలి, జ్వరం, బలహీనత, వాపు, చర్మ సమస్యలు, ఎలర్జీ, రక్తస్రావం, తీవ్రమైన నొప్పి కలుగుతాయని, మరణాలు చాలా సంభవిస్తాయని వివరించారు. జెర్రిలో విష ప్రభావంపై శాస్త్రీయ ఆధారాలతోపాటు చారిత్రక ఆధారాలను తెలుసుకునే దిశగా అధ్యయనం చేస్తున్నారు. చరక సంహితలోనూ శతపాది విష గుణాల గురించి ఉండగా పలు సంప్రదాయ వైద్య విధానాల్లోనూ శతపాది విషం ప్రస్తావన ఉన్నట్టు చెప్తున్నారు. కణతులు, దగ్గు, గజ్జి, గుండె సంబంధిత వ్యాధులను కట్టడి చేసేందుకు అవసరమైన రసాయనిక మిశ్రమాలు ఆ విషంలో ఉన్నట్టు చెప్తున్నారు. అయితే దాని విష ప్రభావ తీవ్రత ఏ స్థాయిలో ఉందనేది ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నారు.

ఫలితాలను చూసి నిబ్బరాన్ని కోల్పోవద్దు

- మహా అయితే 4 కేసులు పెడతారు
- ఇంటింటికీ చేసిన మంచి బతికే ఉంది
- ప్రజల మన్ననలతోనే ఎన్నికలకు వెళ్దాం
- ఎమ్మెల్సీల సమావేశంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ మొదటిసారిగా పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈనెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మండలిలో వ్యవహరించాల్సిన తీరుపై ఎమ్మెల్సీలతో క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మనల్ని ఎవ్వరూ ఏం చేయలేరు..మహా అయితే 4 కేసులు పెట్టగలుగుతారు.. ఫలితాలను చూసి నిబ్బరాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదని చెప్పారు. గడిచిన ఐదేండ్లలో 99 శాతం వాగ్దానాలు అమలు చేశామని తెలిపారు. సినిమాలో ఫస్ట్ ఆఫ్ మాత్రమే అయిందని, కళ్లు మూసుకుంటే 2029 ఎన్నికలు వచ్చేస్తాయని చెప్పారు. ఇంటింటికీ మనం చేసిన మంచి బతికే ఉందని. ప్రజల మన్ననలు పొందిన తర్వాతే ఎన్నికలకు వెళ్దామని తెలిపారు.

బిగ్'సి'లో గెలాక్సీ ఏఐ సూపర్ సేల్

హైదరాబాద్, జూన్ 13: ప్రముఖ రిటైల్ మొబైల్ విక్రయ సంస్థ బిగ్'సి' షోరూంలో సామ్‌సంగ్‌నకు చెందిన గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్లు ఈ నెల 14 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా బిగ్'సి' ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ..సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్లను సూపర్ సేల్‌లో భాగంగా శుక్రవారం నుంచి అన్ని రిటైల్ స్టోర్లలు అందుబాటులోకి తేనున్నట్లు, అత్యంత అధునాతనమైన ఫీచర్లతో రూపొందించిన ఈ మొబైల్ ప్రారంభ ధర రూ.39,999గా ఉందని చెప్పారు. ఈ మొబైల్‌ను కొనుగోలు చేసిన వారికి జీరో డౌన్ పేమెంట్, 24 నెలల్లో నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మొబైల్ కొనుగోలుపై రూ.16 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్, రూ.18 వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ వంటి ఆకర్షణీయమైన ఆఫర్లు లభిస్తాయని వివరించారు.

పంచ్, నెక్సాన్ ఈవీలు సురక్షితమైనవి..

న్యూఢిల్లీ, జూన్ 13: దేశీయ ఆటో మొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటార్స్‌కు చెందిన పంచ్.ఈవీ, నెక్సాన్.ఈవీలకు భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రొగ్రాం(భారత్-ఎన్‌సీఏపీ) 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది. దేశీయ ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఈ రెండు కార్లు అత్యంత సురక్షితమైనవని, అందుకోసం టాటా మోటార్స్‌ను అభినందిస్తున్నానని ఎక్స్‌లో కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

సువెన్ చేతికి సపలా

హైదరాబాద్, జూన్ 13: సువెన్ ఫార్మాస్యూటికల్స్..సపలా ఆర్గానిక్స్‌లో 67.5 శాతం వాటాను కొనుగోలు చేయబోతున్నది. ఒప్పందం విలువ రూ. 229 కోట్లు. ఈ సందర్భంగా సపలా ఫౌండర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. వ్యూహాత్మక వ్యాపార భాగస్వామి సువెన్‌తో కలిసి మరింతగా విస్తరించనున్నట్లు, భవిష్యత్తు వృద్ధికి ఈ వాటా విక్రయం తోడ్పాటునందించనున్నదన్నారు.

డాలర్ ప్రచారకర్తగా మహేశ్ బాబు

హైదరాబాద్, జూన్ 13: ప్రముఖ దుస్తుల సంస్థ డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తాజాగా తెలుగు నటుడు మహేశ్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ వినోద్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల్లో విక్రయాలు 50 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇందుకోసం 50 ఔట్‌లెట్లను ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

ఎఫ్‌టీసీసీఐ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌టీసీసీఐ వార్షిక ఎక్సలెన్స్ అవార్డుల కోసం అర్హులైన పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆన్‌లైన్ ద్వారా ఎఫ్‌టీసీసీఐకి నామినేషన్లు పంపించేందుకు ఈ నెల 20 చివరి గడువు అని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మేలా జయదేవ్ తెలిపారు. ఎగుమతులు, మార్కెటింగ్, నూతన ఆవిష్కరణలు, ఆర్ అండ్ డీ టెక్నాలజీ తదితర 21 విభాగాల్లో విజేతలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

పేటీఎంతో సామ్‌సంగ్ దోస్తీ

గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు ట్రావెల్, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులు

న్యూఢిల్లీ, జూన్ 13: డిజిటల్ పేమెంట్స్ యాప్ పేటీఎంతో సామ్‌సంగ్ జట్టు కట్టింది. దేశీయంగా తమ సామ్‌సంగ్ వాలెట్‌కు ట్రావెల్, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులను జత చేసేలా పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నది. పేటీఎం సహకారంతో ఇక సామ్‌సంగ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు సామ్‌సంగ్ వాలెట్ ద్వారా విమాన, బస్ టికెట్ల బుకింగ్, సినిమా టికెట్ కొనుగోళ్లు, ఈవెంట్ బుకింగ్స్ చేసుకోవచ్చు. గెలాక్సీ స్టోర్ నుంచి ప్రస్తుత సామ్‌సంగ్ వాలెట్ యూజర్లు తమ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ఈ కొత్త సర్వీసులను అందుకోవచ్చు.

అంబుజా చేతికి పెన్నా

మరో సంస్థను హస్తగతం చేసుకున్న అదానీ గ్రూప్

లావాదేవీ విలువ రూ.10,422 కోట్లు

సిమెంట్ ఇండస్ట్రీ ఆధిపత్యంపై గౌతమ్ అదానీ కన్ను

కంపెనీల కొనుగోలుకు రూ.25,000 కోట్లతో నిధి

- 1991లో పెన్నా సిమెంట్‌ను స్థాపించారు.
- 1994 ఆగస్టు 10న అనంతపురం జిల్లా తలారిచెరువు వద్ద తొలి ప్లాంట్ ఏర్పాటు.
- ఏపీ, తెలంగాణ, రాజస్థాన్లలో ప్లాంట్లు.
- ఈ కంపెనీకి 3 ప్యాకేజింగ్ టర్మినళ్లు, 2 గ్రైండింగ్ యూనిట్లు, 4 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లున్నాయి.
- ప్రస్తుత వార్షిక ఉత్పాదక సామర్థ్యం 10 మిలియన్ టన్నులు.
- కృష్ణపట్నం, జోధ్‌పూర్లలో 2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో 2 ప్లాంట్లు రాబోతున్నాయి. మరో 6-12 నెలల్లో వీటి నిర్మాణం పూర్తవుతుంది. అప్పుడు సంస్థ వార్షిక సిమెంట్ ఉత్పాదక సామర్థ్యం 14 మిలియన్ టన్నులకు చేరుతుంది.
- 'పెన్నా సురక్ష' పేరిట ఆసియాలోనే అతి పెద్ద సెల్ఫ్ డిశ్చార్జ్ సిమెంట్ రవాణా నౌక పెన్నా సిమెంట్‌కు ఉన్నది. ఇది 25వేల మిలియన్ టన్నుల సిమెంట్‌ను తీసుకెళ్లగలదు. డిశ్చార్జ్ కెపాసిటీ గంటకు వెయ్యి టన్నులు.
- పెన్నా సిమెంట్‌తో అదానీ గ్రూప్ శ్రీలంక మార్కెట్లోకి ప్రవేశిస్తున్నది. అక్కడ పెన్నా ఓ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నది.

హైదరాబాద్, జూన్ 13: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్.. మరో సంస్థను హస్తగతం చేసుకున్నది. అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్ గురువారం పెన్నా సిమెంట్‌ను పూర్తిగా కొనేసింది. కంపెనీ విలువను రూ.10,422 కోట్లుగా లెక్కగట్టి ఈ లావాదేవీని జరిపింది. ఈ మేరకు అంబుజా సిమెంట్ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)కు తెలియజేసింది. నగదు రూపంలోనే డీల్ ఉన్నట్టు తెలుస్తున్నది. కాగా, పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)తో బైండింగ్ అగ్రిమెంట్‌పై సంతకాలు జరిగాయని చెప్పింది. దీంతో పీసీఐఎల్ 100 శాతం వాటాలు దాని ప్రస్తుత ప్రమోటర్ గ్రూప్, పీ ప్రతాప్ రెడ్డి, ఆయన కుటుంబం నుంచి అంబుజా చేతికి రానున్నాయి. ఇక ఈ డీల్‌తో పెన్నా డీలర్లంతా అంబుజా సిమెంట్ మార్కెట్ నెట్‌వర్క్‌లోకి వస్తున్నారు.

దక్షిణాదిపై పట్టు

పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూప్ దక్షిణాది మార్కెట్ షేర్ మరో 8 శాతం పెరిగింది. ఇప్పటికే అంబుజా, ఏసీసీ సిమెంట్లతో దేశవ్యాప్తంగా సిమెంట్ ఇండస్ట్రీలో బలమైన కార్పొరేట్ శక్తిగా గౌతమ్ అదానీ ఎదిగారు. అయినప్పటికీ భారత్‌లో అల్ట్రాటెక్ తర్వాతి స్థానంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో పెన్నా సిమెంట్ డీల్.. దేశీయ సిమెంట్ పరిశ్రమలో అదానీ వాటాను ఇంకో 2 శాతం పెంచింది. నిజానికి భారతీయ సిమెంట్ ఇండస్ట్రీలో అగ్రస్థానంపైనే అదానీ కన్నేశారు. ఇందు కోసం 3 బిలియన్ డాలర్ల (రూ.25,000 కోట్లు)తో ఓ నిధిని కూడా పక్కకు పెట్టుకున్నారు. ఇక పీసీఐఎల్‌కు వ్యూహాత్మక ప్రాంతాల్లోనే ప్లాంట్లున్నాయి. దీనికి కావాల్సినంత సున్నపురాయి నిల్వలూ ఉన్నాయి. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సిమెంట్‌ను ఉత్పత్తి చేయడానికి పుష్కలంగా అవకాశాలున్నాయని అదానీ గ్రూప్ చెప్తున్నది.

సిమెంట్ గిరాకీకి తగ్గట్టుగా..

భారతీయ సిమెంట్ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నది. ఈ నేపథ్యంలోనే రాబోయే ఐదేండ్లకుపైగా కాలంలో వార్షిక చక్రవృద్ధి రేటు (సీఏజీఆర్) 7 నుంచి 8 శాతంగా ఉండొచ్చని అదానీ గ్రూప్ అంచనా వేస్తున్నది. దేశవ్యాప్తంగా రైల్వే సైడింగ్స్, క్యాపిటివ్ పవర్ ప్లాంట్లు, వేస్ట్ హీట్ రికవరీ సిస్టమ్స్‌తోపాటు సాగునీటి ప్రాజెక్టులు, నివాస సముదాయాలు, రహదారుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే చిన్న, పెద్ద సిమెంట్ కంపెనీలను చేజిక్కించుకోవాలని అదానీ గ్రూప్ ప్రయత్నిస్తున్నది. తద్వారా మార్కెట్‌లోనూ ఆధిపత్యం కొనసాగించాలనుకుంటున్నది. అంబుజా, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్‌ల వార్షిక ఉత్పాదక సామర్థ్యం ఇప్పుడు 78.9 మిలియన్ టన్నులుగా ఉన్నది. దేశవ్యాప్తంగా వీటికి 18 ప్లాంట్లు, 19 గ్రైండింగ్ యూనిట్లున్నాయి. తాజాగా పెన్నా సిమెంట్‌నూ పొందడంతో మొత్తం అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని సిమెంట్ సంస్థల వార్షిక ఉత్పాదక సామర్థ్యం 89 మిలియన్ టన్నులకు చేరుతున్నది. అలాగే కోల్‌కతా, గోపాల్‌పూర్, కర్టైకల్, కొచ్చ